## క్లుప్తంగా

### తడిసిన ధాన్యం తరలింపు



ఆర్మూర్‌టౌన్‌: కురుస్తున్న వర్షాలకు రైతులు పండించిన ధాన్యం తడిసి ముద్దవుతోంది. గురువారం ఉదయం అధికారులు ఆలూర్ బై పాస్ రోడ్డు వద్ద తడిసిన ధాన్యాన్ని లారీల్లో ఎక్కించి రైస్‌మిల్‌కు తరలించారు. మరో వారం రోజుల పాటు వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ తెలుపడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ధాన్యంను త్వరగా కాంట చేసి రైస్‌మిల్‌కు తరలించాలని రైతులు కోరుతున్నారు.

### ఘనంగా భాగ్యరెడ్డి వర్మ జయంతి



ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో దళిత వైతాళికుడు భాగ్యరెడ్డి వర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మున్సిపల్ కమిషన్ రాజు మాట్లాడుతూ.. 1906–1933 మధ్య హైదరాబాద్ సంస్థానంలో 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించి వారి అభ్యున్నతికి పునాదులు వేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ హయూమ్, ఆర్వో ఉమాదేవి, శానిటరి ఎస్సై గజనాంద్, సిబ్బంది పాల్గొన్నారు.

### ఆర్థికసాయం అందజేత

ఆర్మూర్‌టౌన్‌: మున్సిపల్ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ విభాగంలో పనిచేస్తున్న నరేశ్ అనారోగ్యానికి గురికావడంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆయనను పరామర్శించి మాజీ కౌన్సిలర్లు రూ. 30వేల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆకుల రాము, ఇట్టెడి నర్సారెడ్డి, శాల ప్రసాద్, లిక్కిశంకర్, లింబాద్రిగౌడ్ ఉన్నారు.

### రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఆర్మూర్‌టౌన్‌: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఆర్మూర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఇట్టెడి లింగారెడ్డి గురువారం డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నాని అన్నారు.

### కొనసాగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ

బోధన్‌: పట్టణంలోని ఇందూర్ బీఈడీ కళాశాలలో బోధన్ మండల, పట్టణ స్థాయి మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల సెకండరీ గ్రేడ్ టీచర్ల శిక్షణ కార్యక్రమం గురువారం మూడో రోజు కొనసాగింది. శిక్షణా కోర్స్ డైరెక్టర్, ఎంఈవో నాగయ్య శిబిరంలో ఉపాధ్యాయులకు బోధన పద్ధతులను వివరించారు. శిబిరంలో ఎంబెల్లి శంకర్, ధన్‌రాజ్, గంగాధర్, వీరేశ్, అభయందర్, నిజాముద్దీన్, లలిత, వాసవి, వెంకటేశ్వర్‌రావు, హన్మాండ్లు, సందీప్, శ్రీహరి, సంజు, వరలక్ష్మి, శ్రీధర్, గోవర్ధన్, పీరాజీ తదితరులు పాల్గొన్నారు.

### శిక్షణతో బోధన నైపుణ్యాలు పెంపు

కమ్మర్‌పల్లి: ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణతో బోధన నైపుణ్యాలు పెరుగుతాయని కోర్సు డైరెక్టర్, ఎంఈవో ఆంద్రయ్య పేర్కొన్నారు. కమ్మర్‌పల్లి హైస్కూలులో ఉపాధ్యాయులకు మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణను గురువారం పరిశీలించారు. రిసోర్స్ పర్సన్లు ఇస్తున్న శిక్షణ ద్వారా ఉపాధ్యాయులు అభ్యసనా సామర్థ్యాలు సాధించుటకు, విద్యార్థుల నమోదు పెంచేలా దోహదపడుతుందని అన్నారు. కార్యక్రమంలో శిక్షకులు చంద్రశేఖర్, రవీందర్, ప్రసాద్, సంతోష్, అశోక్, వేణుగోపాల్, శంకర్‌గౌడ్, మారుతి పాల్గొన్నారు.

### వరద నీటితో పీఎస్‌ఆర్ కాలనీ వాసుల ఇబ్బందులు



రుద్రూర్‌: కురుస్తున్న వర్షాలకు పోతంగల్ మండలం పీఎస్‌ఆర్ కాలనీలోకి వరద వచ్చి చేరింది. ఎన్నో ఏళ్లుగా ఉన్న పంట కాలువను కొందరు రైతులు పూడ్చి వేయడం వల్ల వర్షం కురిసినప్పుడు వరద కాలనీతో పాటు ఇళ్లలోకి వస్తుందని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గురువారం తహసీల్దార్ గంగాధర్, ఇరిగేషన్ ఏఈ సత్యనారాయణ గ్రామాన్ని సందర్శించి సమస్యను తెలుసుకున్నారు. జేసీబీ సహాయంతో వరద నీటిని బయటకు పంపించారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# చిన్నపాటి వర్షానికే చిత్తడవుతున్న రోడ్లు

- నందిపేట్‌లోని పలు ప్రాంతాలు బురదమయం
- ప్రతి ఏడాది ఇవే తిప్పలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



రాజానగర్‌లో హనుమాన్ మందిరం వద్ద..



నందిపేటలో ఐలమ్మ విగ్రహం వద్ద గుంతలో నిలిచిన నీరు

నందిపేట్‌: చిన్నపాటి వర్షానికి మండలంలోని పలు ప్రాంతాల రోడ్లు చిత్తడవుతున్నాయి. దీంతో ప్రజలు నడిచేందుకు, నడిపేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నందిపేట మండల కేంద్రంలోని ఐలమ్మ విగ్రహం చౌరస్తా నుంచి బజార్ కొత్తూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ రోడ్డు గుండా బజార్ కొత్తూర్, సీహెచ్ కొండూర్, మాయాపూర్, బాద్గుణ, ఉమ్మెడ గ్రామస్తులతో పాటు ఉమ్మెడ బ్రిడ్జి గుండా నిర్మల్ జిల్లాకు చెందిన పలు గ్రామాల వారు వెళ్తుంటారు. ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే అడుగు అడుగున గుంతలు ఉన్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు చేరుతోంది. దీంతో ప్రయాణం నరకంగా మారుతోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఈ రోడ్డు వెంబడి మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నల్లా కనెక్షన్లు ఇచ్చేందుకు తవ్విన గుంతలను సంబంధిత అధికారులు అలాగే వదిలేయడంతో ప్రస్తుతం అవి పెద్దవిగా మారాయి. ప్రధాన పైపులైన్ నుంచి రోడ్డుకు అవతలి వైపు ఇళ్ల కోసం రోడ్డును మధ్యలో నుంచి తవ్వుతూ పైపులైన్ వేశారు. తర్వాత వాటిని పూడ్చటం మరిచి పోవడంతో ఏళ్ల తరబడి వాటికి మరమ్మతులకు నోచుకోవడం లేదు. పలు చోట్ల గుంతలు చెరువులను తలపిస్తున్నాయి. అధికారులు సైతం ఈ రోడ్డు గుండానే వెళ్తున్నా స్పందించడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డును బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

### రోడ్డును బాగుచేయాలి

ప్రతిరోజు ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే నరక యాతనంగా ఉంది. అధికారులు రోజు ఈ రోడ్డు నుండే వెళ్తుంటారు కాని పట్టించుకోవడం లేదు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు.

– నూకపల్లి శేఖర్‌రెడ్డి, నందిపేట

### ప్రయాణం నరకం

ఐలమ్మ విగ్రహం నుంచి బజార్‌కొత్తూర్ వరకు ప్రయాణం చేయాలంటే నరకంగా కనిపిస్తోంది. అడుగు అడుగున గుంతలు ఉన్నాయి. బైక్‌పై రోజు వెళ్లాంటే వెన్నునొప్పి వస్తోంది. ఏళ్ల తరబడి గుంతలు ఏర్పడ్డా అధికారులు స్పందించడం లేదు.

– నడ్పి భూమన్న, బజార్‌కొత్తూర్

# తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రానివ్వొద్దు



వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్



వెంచర్‌లో హద్దులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

- బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో

బోధన్‌టౌన్‌: బోధన్ పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా బల్దియా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సబ్‌కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. గురువారం పట్టణంలోని రాకాసీపేట్‌లో ఉన్న బల్దియా వాటర్ వర్క్స్‌ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. జరుగుతున్న పనులను మున్సిపల్ కమిషనర్‌తో పాటు ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు కలుషితం కాకుండా లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని సూచించారు, పట్టణంలో పైప్‌లైన్‌లను ఎప్పటికప్పుడు పరిశీలించాలని మురుగునీరు కలువకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సబ్‌కలెక్టర్ వెంట కమిషనర్ వెంకట నారాయణ, డీఈ యోగేశ్, ఏఈలు ఉన్నారు.

**మొక్కలు నాటి పర్యవేక్షించమే అమృత మిత్రల భాధ్యత**

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అమృత్ 2.0 పథకంలో భాగంగా గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల ఆవరణలో ఉమెన్‌ఫర్ ట్రీస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సబ్‌కలెక్టర్ వికాస్ మహతో హాజరై సెల్ఫ్‌హెల్ప్‌గ్రూప్ సభ్యులైన అమృత మిత్రలకు ప్రిపరేషన్స్ కిట్స్ అందజేశారు. అమృత మిత్రలు తమకు ఇచ్చిన బాధ్యతను పూర్తి బాధ్యతతో నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకట నారాయణ, డీఈ యోగేశ్, టీఎమ్‌సీ శ్రీనివాస్, అమృత మిత్రలు ఉన్నారు.

**బఫర్‌జోన్ పరిశీలన**

రెంజల్‌: రెంజల్ శివారులోని సన్ సిటీ వెంచర్ సమీపంలో బఫర్‌జోన్‌తో పాటు సాగర్ కాలువ సరిహద్దులను అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, ఇరిగేషన్ జిల్లా అధికారి ప్రవీణ్ గురువారం పరిశీలించారు. వెంచర్‌కు ఎన్‌వోసీ కోసం దరఖాస్తు చేసుకోగా జిల్లా అధికారులు పరిశీలించారు. రెంజల్ శివారులోని 341/ఏలో 10 ఎకరాల 34 గుంటల్లో వెంచర్‌ను ఏర్పాటు చేయగా నిబంధనల ప్రకారం కేటాయించిన 10 శాతం భూమిలో గ్రీనరీ ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి రాజేందర్‌రావు ఉన్నారు.

# ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి చూపాలి



రైతులకు ఐడీ కార్డులను అందజేస్తున్న జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగా రెడ్డి

పెర్కిట్‌: ఒక్కసారి మొక్క నాటిన తర్వాత 20 ఏళ్ల పాటు ఆదాయాన్నిచ్చే ఆయిల్ పామ్ సాగుపై రైతులు ఆసక్తి పెంచుకోవాలని జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగా రెడ్డి అన్నారు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో గురువారం జిల్లా ఉద్యానవన శాఖ, ప్రీయూనిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ గెలల సేకరణ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పల్లె గంగా రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా ఉద్యానవన శాఖ అధికారులు ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ఎప్పటికప్పుడు సస్యరక్షణ చర్యలు తెలియజేస్తూ వెన్నంటే ఉండాలన్నారు. మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగా రెడ్డి మాట్లాడుతూ.. భారత దేశానికి 180 లక్షల టన్నుల పామ్ ఆయిల్ అవసరముండగా ప్రస్తుతం 80 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతున్నట్లు తెలిపారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి బండారి శ్రీనివాస్ మాట్లాడుతూ.. త్వరలో జిల్లా వ్యాప్తంగా ఆయిల్ పామ్ గెలల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌వో రాజు గౌడ్, డ్రిప్ ఇరిగేషన్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ భారతి, ప్రీయూనిక్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టర్ పాశం ప్రసాద్, మల్లేశ్వర్ రావు, రోహిత్, రైతులు భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతులు మేలైన టీజీ సీడ్స్ విత్తనాలు కొనాలి



డొంకేశ్వర్‌: ప్రభుత్వం ఆమోదం తెలిపిన తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్ విత్తనాలనే కొనాలని డొంకేశ్వర్ సొసైటీ చైర్మన్ భరత్‌రాజ్ రెడ్డి రైతులకు సూచించారు. గురువారం సొసైటీ కార్యాలయంలో 'మన సంస్థ మన విత్తనం' పోస్టర్లను విడుదల చేశారు. ఖరీఫ్ సాగుకు అసరమయ్యే నాణ్యమైన విత్తనాలు సీడ్స్ కార్పొరేషన్ రైతులకు అందిస్తుందని దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ విత్తనాల ద్వారా అధిక దిగుబడులు వస్తామన్నారు. సొసైటీల్లో విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇందులో సొసైటీ డైరెక్టర్లు, సీఈవో కృష్ణ, రైతులు ఉన్నారు.

# అవినీతంతా గత పాలకవర్గానిదే!



సొసైటీ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు



డైరెక్టర్లతో కలిసి మాట్లాడుతున్న చైర్మన్ అశోక్

మాక్లూర్‌: మాక్లూర్ సొసైటీలో జరిగిన అవినీతి అంతా గత పాలకవర్గానిదేనని, నా హయాంలో ఒక్క రూపాయి అవినీతి జరిగిన నా మెడలో చెప్పుల దండ వేసి ఊరేగించండని చైర్మన్ బూరోల్ల అశోక్ అన్నారు. ఒకవేళ కక్షపూరితంగా, తప్పుడు లెక్కలతో అవినీతి నింద మోపినా దానికి బాధ్యుడనై తన భార్య పుస్తెల తాడు, పొలాలు అమ్ముకొని అయినా చెల్లిస్తానని హామీ ఇచ్చారు. మాక్లూర్ గ్రామానికి చెందిన కొందరు రైతులు గురువారం సొసైటీ కార్యాలయానికి చేరుకొని ఆందోళన చేపట్టారు. అవినీతికి పాల్పడుతున్నావంటూ చైర్మన్ అశోక్‌ను నిలదీశారు. అయినా అశోక్‌కు అధికార పార్టీ నేతలు అండగా నిలవకపోవడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో మాక్లూర్ సొసైటీలో రూ.2కోట్లకు పైగా జరిగిన అవినీతి అక్రమాలను 'సాక్షి' ఎప్పటికప్పుడు బయటపెట్టింది. అప్పటి ఎమ్మెల్యేకు భయపడి ఎవరూ అవినీతిని నిలదీయలేదు. ప్రభుత్వం మారటంతో చైర్‌పర్సన్ లక్ష్మిని తొలగించారు. అలాగే మాజీ సీఈవో విష్ణువర్ధన్ పాత్ర కూడా ఉందని అతన్ని పక్కన పెట్టి కల్లెడికి చెందిన సంతోష్ అనే వ్యక్తిని నియమించారు. సంతోష్ అవినీతి కూడా రూ.50 లక్షలకు పైగా తేలటంతో అతన్ని తొలగించారు. అశోక్ హయాంలో తిరిగి విష్ణువర్ధన్ సీఈవోగా బాధ్యతలు చేపట్టారు. కొంత కాలానికే అతడిని తొలగించి ప్రవీణ్ అనే వ్యక్తిని నియమించారు. ఈ విషయంలో విష్ణువర్ధన్ మనస్తాపం చెంది, పాలకవర్గాన్ని రద్దు చేయాలన్న పట్టుదలతో సొసైటీలో గందరగోళం సృష్టిస్తున్నాడని కొందరు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌ల అందజేత



పచ్చలనడ్కుడలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో అన్వేష్‌రెడ్డి



అంకాపూర్‌లో ప్రొసీడింగ్ కాపీని అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్

వేల్పూర్‌: వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో 54 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. ఇందులో 8 మంది పనులు ప్రారంభించడంతో వారికి ప్రొసీడింగ్ కాపీలు అందజేశారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి నవనీత, గుడాల మోహన్, టక్కర్ గంగాధర్, గట్టువుతల నర్సారెడ్డి, భూమన్న, గంగారెడ్డి, రమేశ్, నెహ్రూ పాల్గొన్నారు.

**అంకాపూర్‌లో..**

పెర్కిట్‌: ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఆర్మూర్ ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్, వైస్ చైర్మన్ విట్టం జీవన్ ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ అమృత్ రావు, కార్యదర్శి హారిక, జూనియర్ అసిస్టెంట్ చందన తదితరులు పాల్గొన్నారు.



బాల్కొండలో భూమి పూజ చేస్తున్న నాయకులు

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ**

బాల్కొండ: మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇందిరమ్మ కమిటీ సభ్యులు గురువారం భూమి పూజ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సంజీవ్, అర్వింద్, ఇమ్రాన్, కుందారపు శ్రీనివాస్, విద్యాసాగర్, యూనిస్, మజార్ తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



బోధన్‌టౌన్‌: బోధన్ ప్రజలకు లయన్స్ క్లబ్ బృందం అందిస్తున్న వైద్య సేవలు అభినందనీయమని లయన్స్ ఇంటర్నేషనల్ థర్డ్ వైస్ ప్రెసిడెంట్ మనోజ్‌షా, డైరెక్టర్ బాబురావు అన్నారు. గురువారం బోధన్ లయన్స్ కంటి ఆస్పత్రిని వారు సందర్శించారు. 2023–24 సంవత్సరం డిస్ట్రిక్ ఎక్స్‌లెన్స్ అవార్డులను ఉత్తమ సేవలు అందించిన లయన్స్ ప్రతినిధులకు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు వేమూరి లక్ష్మి, బసవేశ్వర్‌రావు, కొడాలి కిశోర్‌కుమార్, నర్సింహారెడ్డి, ఉమేశ్ సిండే, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# రోజంతా వర్షం

- రోడ్లన్నీ జలమయం
- ఇబ్బందిపడ్డ వాహనదారులు



హౌసింగ్‌బోర్డు కాలనీలో ఇళ్లలోకి చేరిన వరద



హుస్నాబాద్‌కాలనీలో మురికికాలువపై నుంచి పారుతున్న వరద

ఆర్మూర్‌టౌన్‌/ బాల్కొండ: ఆర్మూర్ పట్టణంలో గురువారం భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. రోడ్లపై భారీ వరద పారడంతో వాహదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మురికి కాలువలపై నుంచి వరద పారింది. హౌసింగ్‌బోర్డు కాలనీలో ఇళ్లల్లోకి వరద చేరడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు. మున్సిపల్ అధికారులు పట్టణంలో వరదనీరు ఆగకుండా చర్యలు చేపడుతున్నారు. బాల్కొండలో వర్షం దంచి కొట్టింది. సజ్జ కల్లాలోకి భారీగా వర్షపు నీరు చేరడంతో సజ్జ కంకులు జలమయమయ్యాయి. నూర్పిడి చేసిన సజ్జలు మొలకెత్తాయి. ధాన్యం తడిసింది. పలు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు జల మయమయ్యాయి. అకాల వర్షాలకు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



లక్ష్మికాలువలో చేరిన వర్షపు నీరు



నల్లూర్‌లో తడిసిన ధాన్యం

# కూచిపూడిలో చిన్నారి ప్రతిభ



చిన్నారికి జ్ఞాపికను అందజేస్తున్న దైవజ్ఞ శర్మ

పెర్కిట్‌: ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల చిన్నారి జయారెడ్డి కూచిపూడి నాట్యాన్ని నేర్చుకున్న ఆరు రోజుల అనతి కాలంలోనే అద్భుత ప్రదర్శనతో అందరిని ఆకట్టుకున్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి మనవరాలు అయిన జయారెడ్డి హైదరాబాద్‌లోని నాట్య గురువు వద్ద ఆరు రోజుల్లో కూచిపూడి నాట్యాన్ని నేర్చుకుంది. రవీంద్ర భారతిలో బుధవారం నృత్యమాల నాట్యకళ వెల్ఫేర్ సొసైటీ, సిరి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జయా రెడ్డి తన అద్భుత ప్రదర్శనతో అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమానికి ప్రముఖ న్యూమరాలజిస్టు దైవజ్ఞ శర్మ, నాట్యాచారులు ఏలేశ్వరపు చలపతి శాస్త్రీ ముఖ్య అతిథులుగా హాజరై చిన్నారిని మెమొంటో, ప్రశంస పత్రాలతో సన్మానించారు.

# పరీక్ష అట్టల పంపిణీ

రుద్రూర్‌: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నెల రోజులుగా స్వచ్ఛంద సంస్థ రైడ్స్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు గురువారం 2000–01 పదో తరగతి పూర్వ విద్యార్థులు పరీక్ష అట్టలు, పెన్నులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో కట్ట శ్రీనివాస్, పత్తి రాము, బెజగం వెంకటేశం, కె కృష్ణ ప్రసాద్, చిదుర మహిపాల్, బోరె రాజు, లోగం సురేశ్, ఈరపురం సాయిలు, పార్వతి ప్రవీణ్, సాదుల ప్రవీణ్, పుట్టి సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సైకు సన్మానం

బాల్కొండ: మెండోరా ఎస్సై యాసర్ అరాఫత్‌ను గురువారం మెండోరా మండల ఎమ్మార్పీఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు గణేశ్, రూపేశ్, విజయ్, శంకర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికం..

**భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి**

వేల్పూర్‌: వేల్పూర్ మండలం పోచంపల్లిలో గురువారం హనుమస్ మాలధారులు భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి నిర్వహించారు. హోమం, ప్రత్యేక పూజలు చేశారు. 45 మంది భక్తులు 41 రోజుల పాటు పాటించిన హనుమాన్ దీక్ష విరమించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో హనుమాన్ భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**మోస్రాలో..**

వర్ని: మోస్రా మండల కేంద్రంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు శ్రీనివాస్, నవీన్ స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**సాయిబాబా ఆలయంలో పూజలు**

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు సాయిబాబాను దర్శించుకున్నారు. ప్రతి గురువారం ఆలయంలో అన్నదానం ఉటుందని సాయి సేవా సమితి సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు ఎన్ చారి, చిట్ల యజ్ఞేశ్, మహాలింగం, విజయ్ ప్రకాశ్, భక్తులు పాల్గొన్నారు.



పోచంపల్లిలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

**వేల్పూర్‌లో పెద్దమ్మకు బోనాలు**



వేల్పూర్‌: వేల్పూర్ మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గురువారం పెద్దమ్మతల్లికి బోనాలు సమర్పించారు. గ్రామ దేవతలకు పవిత్ర గోదావరి నీటితో జలాభిషేకం నిర్వహించారు. బోనాలు సమర్పించి పూజలు చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘస్తులు పాల్గొన్నారు.

# రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి



ఎడపల్లి: వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని రైతులకు రుద్రూర్ వరి పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా గురువారం ఎడపల్లి మండలం పోచారం జీపీ కార్యాలయంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్త సాయిచరణ్ మాట్లాడుతూ.. పొలంలో కీటకాల ఉధృతి పరిమిత స్థాయిని దాటినప్పుడు మాత్రమే రసాయన మందులు వినియోగించాలని సూచించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రశాంతి మాట్లాడుతూ.. పంటకి సాగునీరు అవసరం మేరకు అందించాలని, మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని రైతులకు సూచించారు. ఏవో సిద్ధి రమేశ్వర్ మాట్లాడుతూ.. రైతులు తప్పనిసరిగా వేసవి దుక్కులు చేసుకోవాలని, జనుము, జీలుగు వంటి పంటలను వరి పంటకు ముందు సాగు చేయాలన్నారు. పశు వైద్యాధికారి ప్రమోద్, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ మహేందర్ రైతులు పాల్గొన్నారు.

## సినిమా

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

| | |
|---|---|
| స్క్రీన్-3 | సింగిల్(తెలుగు)-10.45, 1.30, 7.45<br>మిషన్ ఇంపాజిబుల్(తెలుగు)-4.15, 10.30 |
| స్క్రీన్-4 | శుభం(తెలుగు)-10.50, 7.55<br>ఏస్(తెలుగు)-1.30, 10.35<br>హిట్(తెలుగు)-4.40 |

## మాంసం ధరలు (రూ..)

| | | | |
|---|---|---|---|
| చికెన్ | ధరలు (కిలోకు) | డ్రెస్డ్ | 180 |
| | | లైవ్ | 140 |
| స్కిన్‌లెస్ | 200 | మటన్ | 800 |

## బంగారం ధరలు (10గ్రాములు)

| | | | |
|---|---|---|---|
| 24 క్యారెట్స్ | 97,600 | వెండి(కిలో) | 1,02,500 |
| 22 క్యారెట్స్ | 90,095 | | |

– నిజామాబాద్ బిజినెస్